# ఆర్టీసీ సేవలు కరువు

**గ్రామాలకు బస్సులు రాక ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

- విద్యార్థులకూ తప్పని తిప్పలు
- ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం
- బస్సు సర్వీస్‌లను వెంటనే పునరుద్ధరించాలని వేడుకోలు



కోదాడ -సూర్యాపేట పట్టణాల మధ్య మునగాల మీదుగా నడుస్తున్న పల్లెవెలుగు బస్సు

**మునగాల :** మండలంలోని పలు మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలు కరువయ్యాయి. బస్సులు రాక పేద ప్రజలు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కోదాడ ఆర్టీసీ డిపో నుంచి మండలంలోని నరసింహులగూడెం, మునగాల మీదుగా గరిడేపల్లి మండలం వెలిదెండ, నేలమర్రి, కలకోవ, నడిగూడెం మండల కేంద్రం మీదుగా మండలంలోని జగన్నాథపురం గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. కాలక్రమేణా ఆదాయం లేకపోవడంతో ఆయా బస్సుల సేవలను కోదాడ డిపో రద్దు చేసింది. ఆ తర్వాత నరసింహులగూడెం, వెలిదెండ గ్రామాలకు మాత్రమే బస్సులు నడిపించారు. ప్రస్తుతం ఆ రెండు బస్సు సర్వీసులను కూడా డిపో రద్దు చేసింది.

**ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం..**

నర్సింహులగూడెం, రేపాల, విజయరాఘవపురం, నేలమర్రి, వెంకట్రాంపురం, కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలో గల ప్రైవేటు పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసించేందుకు నిత్యం వచ్చిపోతుంటారు. బస్సులు లేక మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు ప్రతినిత్యం సుమారు 500 మంది విద్యార్థులు తమ గ్రామాల నుంచి ఆటోల ద్వారా పాఠశాలకు వచ్చిపోతున్నారు. ఆటోలలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నిత్యం ప్రయాణించాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఐదు గ్రామాలకే బస్సు సౌకర్యం..**

మండలంలో జాతీయ రహదారిపై ఉండే కేవలం ఐదు గ్రామాలకే పల్లెవెలుగు బస్సు సౌకర్యం అందుబాటులో ఉంది. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు మొరపెట్టుకున్న ఫలితం లేదు. ఇటీవల వెలిదెండ బస్సును పునరుద్ధరించాలని కొక్కిరేణికి చెందిన సీపీఎం నాయకులు కోదాడ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని వినియోగించలేకపోతున్నామని మహిళలు అంటున్నారు. కనీసం వెలిదెండ, నరసింహులగూడెం గ్రామాలకైనా బస్సులను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

### బస్సులను పునరుద్ధరిస్తాం

కోదాడ ఆర్టీసీ డిపో నుంచి గతంలో వెలిదెండ, నర్సింహులగూడెం గ్రామాలకు పల్లెవెలుగు బస్సు సర్వీసులు నడిపించాం. గత రెండు నెలల క్రితం నిలిపివేశాం. ప్రస్తుతం ఆ రెండు సర్వీసులను రెండు, మూడు రోజుల్లో పునరుద్ధరిస్తాం. ఆదాయ వనరులు లేకపోవడంతో మిగతా గ్రామాలకు బస్సులను పునరుద్ధరించే అవకాశం లేదు.

– జానిరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్లగొండ

### ఆటోలను ఆశ్రయిస్తున్నాం



గతంలో కోదాడ నుంచి మా గ్రామం మీదుగా గరిడేపల్లి మండలం వెలిదెండ, హుజూర్‌నగర్ పట్టణాలకు బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం ఆ బస్సును రద్దు చేయడంతో మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే వెలిదెండ బస్సును పునరుద్ధరించాలి.

– నందిగామ రాణి, కొక్కిరేణి

### ఇబ్బందులు పడుతున్నాం



గతంలో మా ఊరి మీదుగా నర్సింహులగూడెం నుంచి మునగాల వరకు బస్సు సౌకర్యం ఉంది. గత కొన్ని నెలలుగా సదరు బస్సును రద్దు చేశారు. దీంతో మేము నిత్యం ఆటోలలో ఇబ్బందులు పడుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని స్కూల్‌కు వెళ్లాల్సి వస్తుంది. నర్సింహులగూడెం బస్సును పునరుద్ధరించాలి.

– జంపాల ప్రభాకర్, విద్యార్థి, రేపాల

### డిపో మేనేజర్ స్పందించాలి



కోదాడ నుంచి మండల కేంద్రం మీదుగా గణపవరం, కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సును రద్దు చేయడంతో పేదలు ఎక్కువ చార్జీలు చెల్లించి ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తుంది. బస్సును పునరుద్ధరించాలని ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చాం. వెలిదెండ బస్సును పునరుద్ధరించాలి.

– సైదులు, కొక్కిరేణి

## క్లుప్తంగా

### అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు


బ్రహ్మచారిని సత్కరిస్తున్న పోస్టల్ సిబ్బంది

**మునగాల :** మండలంలోని తాడువాయి గ్రామ బ్రాంచ్ సహాయ పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన నాగార్జునపు బ్రహ్మచారిని స్థానిక పోస్టల్ శాఖ కార్యాలయంలో శనివారం పోస్టల్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన సబ్ పోస్టుమాస్టర్ దయాకర్ మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసిన వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఓ అశోక్, బీపీఎంలు వెంకటరెడ్డి, హరి, సందీప్, దివ్య, మోతిలాల్, సునీల్ పాల్గొన్నారు.

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావుకు సన్మానం


సుబ్బారావును సన్మానిస్తున్న నాగన్నగౌడ్, తదితరులు

**హుజూర్‌నగర్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఈద్పుగంటి సుబ్బారావును శనివారం హుజూర్‌నగర్‌లోని మంత్రి ఉత్తమ్ క్యాంప్ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బూరుగడ్డ పీఏసీఎస్ చైర్మన్ దొంగరి వేంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య, బ్లాక్ అధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముక్కంటి, జిల్లా సహాయ కార్యదర్శి చింతకాయల రాము, రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సలిగంటి జానయ్య, జి.రాములు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### ఆపదలో ఉన్న ఎల్‌ఐసీ ఏజెంట్‌కు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు, ఉద్యోగులు

**కోదాడరూరల్ :** మండల పరిధిలోని కాపుగల్లుకు చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ మాధవరపు బ్రహ్మం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో తోటి ఎల్‌ఐసీ ఏజెంట్లు, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది కలిసి రూ.1.45 లక్షలు ఆదివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రమేష్‌రెడ్డి, లియాఫీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మల్లేష్, సోందుమియా, రాము, కన్నయ్య, సైదా, బోళ్ల వీరారెడ్డి, ఏడుకొండలు, రామారావు, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

### ఘనంగా దేవాలయ తృతీయ వార్షికోత్సవం


బోనాలు సమర్పిస్తున్న భక్తులు

**గరిడేపల్లి :** మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో శ్రీ కనకదుర్గ, అంకాలమ్మ, పోతరాజుల దేవాలయ తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, అన్నంబోట్ల ప్రణయ్‌కుమార్ ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అమ్మవార్లకు శ్రీదుర్గ సూక్తులచే అభిషేకం, పుష్పార్చన, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### బడిబాట ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**నేరేడుచర్ల :** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. శనివారం నేరేడుచర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ ఇంటింటికీ కరపత్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్‌ఖాన్, జానయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, మంగమ్మ, మోహన్ తదితరులు ఉన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్

- సీనియర్ సివిల్ జడ్జి సురేష్


కోదాడరూరల్ : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సురేష్

**కోదాడరూరల్ :** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి మార్గమని సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు డబ్బు, సమయం రెండు ఆదా అవుతాయని అన్నారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. కక్షలు, పట్టింపులకు పోయి కక్షిదారులు నష్టపోవద్దని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 354, సివిల్ కేసులు 5, నేరం ఒప్పుకున్న కేసులు 45, 65 బ్యాంకు కేసుల ద్వారా రూ.56 లక్షలు, జరిమానాల ద్వారా రూ.1.90 లక్షలు, 764 ఎస్టీసీ కేసుల ద్వారా రూ.25 వేలు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి భవ్య, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు ఉన్నారు.

**లోక్ అదాలత్‌లో 791 కేసుల పరిష్కారం**

**హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ న్యాయస్థానాల పరిధిలోని 791 కేసులను జాతీయ మెగాలోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 6 సివిల్ కేసులు, 785 క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు. వివిధ కేసుల్లో తమ నేరాలను అంగీకరించిన కక్షిదారులకు రూ.26,07,780 జరిమానా విధించి ఆ పైకాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు చల్లా కృష్ణయ్య, గొట్టే ప్రశాంత్, జుట్టు కొండ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి చనగాని యాదగిరి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, ఎంఎస్ రాఘవరావు, రవికుమార్, సైదా హుస్సేన్, రామినేని వెంకటేష్, కొట్టు సురేష్, ఏజీపీలు శ్రీనివాసులు రేణుక దేవి, సురేష్ నాయక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది, జూనియర్, సీనియర్ న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి రాజు

**మునగాల :** ప్రకృతి వ్యవసాయం చేపడితే ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని మండల వ్యవసాయాధికారి బి.రాజు తెలిపారు. శనివారం మండలంలోని ముకుందాపురంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముకుందాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి 125 మంది రైతులను గుర్తించి ప్రకృతి వ్యవసాయం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపికైన రైతులకు సహజసిద్ధ ఎరువులు, చీడపీడల నివారణకు కషాయాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ అభ్యుదయ రైతులు మొలుగూరి గోపి, బండారు వెంకటేశ్వర్లు.. ప్రకృతి వ్యవసాయంలో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ రేష్మా, కిసాన్ సెల్ అధ్యక్షుడు నర్రా శ్రీపాల్ రెడ్డి, రైతులు నర్రా సత్యనారాయణరెడ్డి, ఇంద్రశేఖర్ రెడ్డి, కోటిరెడ్డి, తుమ్మల శ్రీను, దయాకర్‌రెడ్డి, ముస్కుల సైదిరెడ్డి, వీరారెడ్డి, లాజరు, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

# 16న ఆలగడప టోల్‌గేట్ వద్ద రాస్తారోకో


అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

**నేరేడుచర్ల :** కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ఆలగడప టోల్‌గేటు వద్ద స్థానిక వాహనాల నుంచి టోల్ రుసుం వసూలుపై శనివారం నేరేడుచర్లలో అఖిల పక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, బీఆర్‌ఎస్ నేత రాపోలు నవీన్, టీడీపీ నేత ఇంజమూరి వెంకటయ్య, జనసేన పార్టీ నేత నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక చోట్ల గల టోల్‌గేట్ పరిధిలో 20 కిలోమీటర్ల మేర వాహనాలు ఉచితంగా ప్రయాణిస్తున్నాయని, ఒక్క ఆలగడప టోల్గేట్ వద్ద మాత్రమే వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆలగడప టోల్ వసూలును నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన టోల్‌గేట్ వద్ద రాస్తారోకో నిర్వహించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఎమ్మార్పీఎస్ నేత యడవల్లి అరుణ్, ఏఐటీయూసీ నేత ఉదర వెంకన్న, యడవల్లి వెంకటకృష్ణ, కొమ్రరాజు వెంకట్, భరత్ తదితరులు ఉన్నారు.

# గీత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగన్నగౌడ్, వెంకటేశ్వర్లు, తదితరులు

**హుజూర్‌నగర్‌రూరల్ :** గీత కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్, డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బూరుగడ్డలో గీత కార్మికుల ఆరాధ్య దైవం శ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానికంగా గల సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కాసాని గురువయ్యగౌడ్, వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ ఎరగాని గురువయ్యగౌడ్, నాయకులు భిక్షం, వెంకయ్య, నరసింహారావు, నాగరాజు, సైదులు, కృష్ణమోహన్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


నేరేడుచర్ల : 4వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ అశోక్‌రెడ్డి

**నేరేడుచర్ల :** ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 4వ వార్డులో తడి, పొడి చెత్త వేరు చేయూ విధానం, ఎరువుల తయారీపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. వార్డుల్లో నిరుపేదలు, వీధి వ్యాపారులపై మహిళ సంఘాల సభ్యులు సర్వే చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, సమభావన సంఘాల సభ్యులు ఉన్నారు.


హుజూర్‌నగర్ : వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది

**పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలి**

**హుజూర్‌నగర్ :** మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీలోని మూడో వార్డు ఎన్జీవోస్ కాలనీ, గణేష్ నగర్, చైతన్య కాలనీలలో మురికి కాలువలో సిబ్బందితో పూడికతీత పనులు చేయించారు. దోమల నివారణకు పిచ్చి చెట్లు తొలగించి ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ అశోక్, జవాన్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

### రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

**చిలుకూరు :** కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు వానాకాలం రైతు భరోసాకు సోమవారం నుంచి వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 05, 06, 2025 నాటివరకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకం పొందిన వారు ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**రైతు భరోసాకు దరఖాస్తుల స్వీకరణ**

**గరిడేపల్లి :** రైతు భరోసాకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రీతమ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కొత్తగా పట్టాదార్ పాసుపుస్తకాలు పొందిన రైతులు వానాకాలం సీజన్ రైతు భరోసా కోసం ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతు భరోసా పొందుతున్న రైతులు బ్యాంకు ఖాతా మార్చుకోవాలనుకుంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌లను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని తెలిపారు.

**19 వరకు దరఖాస్తుకు అవకాశం**

**నేరేడుచర్ల :** రైతు భరోసాకు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జావిద్ శనివారం కోరారు. 2025 జూన్ 5వ తేదీ లోపు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు అర్హులని తెలిపారు.

### ఆర్యవైశ్య జిల్లా మహాసభను విజయవంతం చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

**నడిగూడెం :** కోదాడ పట్టణంలో ఆదివారం నిర్వహించబోయే జిల్లా ఆర్యవైశ్య మహాసభను విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో వారు కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరు వెంకటేశ్వర్లు, రేపాల పురుషోత్తం, నాయకులు గజ్జి అప్పారావు, వందనపు మోహన్‌రావు, సూర్యప్రకాష్‌రావు, కొండా వెంకన్న, వందనపు దయాకర్, దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### బస్సులో పోగొట్టుకున్న పర్సు బాధితురాలికి అప్పగింత


బాధితురాలికి పర్సు అప్పగిస్తున్న కండక్టర్ వెంకటేశ్వర్లు

**నేరేడుచర్ల, మిర్యాలగూడ టౌన్:** బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన పర్సును తిరిగి ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు కండక్టర్. వివరాలు.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన భీమవరపు మౌనిక శుక్రవారం మిర్యాలగూడ బస్టాండ్‌లో కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఎక్కి నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో దిగింది. ఆమె తన పర్సును బస్సులోనే మర్చిపోయింది. కండక్టర్ వెంకటేశ్వర్లు పర్సును గుర్తించి పరిశీలించగా.. అందులో సెల్‌ఫోన్‌తో పాటు రూ.1320 నగదు ఉండటంతో మిర్యాలగూడ డిపోలోని విచారణ కేంద్రంలో అప్పగించారు. బాధితురాలికి సమాచారం ఇచ్చి శనివారం పర్సును ఆమెకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్ వెంకటేశ్వర్లును డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

### కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని మట్టపల్లి బైపాస్ రోడ్డులో గల శ్రీగోదాపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో శ్రీవారి మూలమూర్తికి ప్రత్యేక నవకలశ అభిషేకం చేశారు. అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ఏనుగుల మోహన్ సేవలు మరువలేనివి

**సూర్యాపేట అర్బన్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగ ఉద్యమ నాయకుడు ఏనుగుల మోహన్ సేవలు మరువలేనివని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. శనివారం ఏనుగుల మోహన్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై మోహన్ నిరంతరం ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి, పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు రామలింగమ్మ, ప్రవీణ్, శ్రావణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### నీట్ ఫలితాల్లో మండల విద్యార్థికి 2,982 ర్యాంకు

**చివ్వెంల :** మండల పరిధిలోని గాయంవారిగూడెం ఆవాసం బంగారు తండాకు చెందిన దరావత్ జస్వేష్ శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 2,982 ర్యాంకు సాధించాడు. ఎస్టీ కేటగిరిలో 20వ ర్యాంకు సాధించాడు. తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దరావత్ బాలాజీ, దరావత్ సుజాతల చిన్న కుమారుడైన జస్వేష్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. పది ఫలితాల్లో సూర్యాపేట పట్టణంలోని కాకతీయ పాఠశాలలో 9.8 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. అదే విధంగా హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్‌లో 981 మార్కులు సాధించి కాలేజీలో సెకండ్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా మండల ప్రజలు, గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

**సూర్యాపేట అర్బన్ :** ప్రజలు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వినియోగించి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. శనివారం సూర్యాపేట కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సందర్భంగా కోర్టు ఆవరణలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, విచిత్ర వేషధారణలో ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చల్లా నరేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ నాగరాజు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యంపై పట్టింపేదీ !


కందిబండ గ్రామ పరిధిలో రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం

**మేళ్లచెరువు :** మండలంలో పలు గ్రామాల్లో చెత్తాచెదారం డంపింగ్ యార్డులకు తరలించకపోవడంతో రోడ్ల వెంట పేరుకుపోయింది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేక పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల వెంట వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని అంటున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

- ఒకే రాత్రి మూడు ఇళ్లలో చోరీకి పాల్పడిన దొంగలు
- చిలుకూరు మండలం బేతవోలులో ఘటన


వేలిముద్రలు సేకరిస్తున్న ఎస్ఐ, పోలీసులు

**చిలుకూరు :** తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకుని రాత్రికి రాత్రే ఒకే గ్రామంలోని మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామ శివారులో జెర్రిపోతులగూడేనికి వెళ్లే దారిలో నివాసముంటున్న యరమళ్ల బాలకృష్ణ శుక్రవారం ఉదయం పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. రాత్రి ఆలస్యంగా ఇంటికి వస్తానని తన భార్య రమ్యకు చెప్పడంతో.. ఆమె ఇంటికి తాళం వేసి కుమారుడితో కలిసి గ్రామంలోనే తమ బంధువు కట్ల నాగమణి ఇంట్లో నిద్రించడానికి వెళ్లింది. రాత్రి 12గంటలకు బాలకృష్ణ హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులుకు సమాచారం ఇచ్చాడు. నాగమణి ఇంట్లో నిద్రించడానికి వెళ్లిన తన భార్య రమ్యకు విషయం చెప్పడంతో ఆమెతో పాటు నాగమణి కూడా వారి ఇంటికి తాళం వేసి రమేష్ ఇంటికి వచ్చారు. బీరువాలో ఉన్న వెండి సామాన్లు చోరీకి గురైనట్లు బాలకృష్ణ తెలిపాడు.

**పోలీసులు విచారణ చేస్తుండగానే..**

పోలీసులు గ్రామానికి చేరుకుని రమేష్ ఇంట్లో విచారణ చేస్తుండగానే.. నాగమణి ఇంటికి తాళం వేసినట్లు గుర్తించిన దొంగలు ఆమె ఇంట్లో కూడా చోరీ చేశారు. విషయం తెలుసుకున్న నాగమణి పోలీసులతో కలిసి ఇంటికి వచ్చి చూడగా.. బీరువాలోని 8తులాల బంగారం, 30తులాల వెండి, రూ.2లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. దొంగలు గ్రామంలోనే ఉండడంతో పోలీసులు వారి కోసం వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అక్కినపల్లి జానకిరామాచారి తన స్నేహితుడి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అవసరం నిమిత్తం తీసుకొచ్చి రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేసి తాళం బైక్‌కే ఉంచాడు. పోలీసులు తమను వెతుకుతున్నట్లు గుర్తించిన దొంగలు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై పరారయ్యారు.

**కానిస్టేబుల్‌ను నెట్టేసి మరీ..**

దొంగలు బేతవోలు నుంచి చిలుకూరు వైపు వెళ్తున్నట్లు పోలీసులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది బేతవోలు రోడ్డులో కొండాపురం గ్రామ స్టేజీ దగ్గర దొంగలు వెళ్తున్న బైక్‌ను ఆపుతుండగా.. కానిస్టేబుల్ తిరపతయ్యను నెట్టేసి మరీ పరారయ్యారు. దీంతో కానిస్టేబుల్ తిరుపతయ్య కాలుకు గాయమైంది. బైక్‌పై ఇద్దరు దొంగలు ఉన్నారని, వారు ముఖానికి మాస్కులు ధరించినట్లు పోలీసులు తెలిపారు.

### వెలుగులోకి మరో దొంగతనం..

ఈ నెల 11వ తేదీన బేతవోలు గ్రామానికే చెందిన సావిత్రమ్మ తన ఇంటికి తాళం వేసి కుమార్తె దగ్గరకు వెళ్లింది. గ్రామంలో దొంగతనాలు జరిగినట్లు తెలియడంతో ఆమె శనివారం ఉదయం ఇంటికి రాగా.. ఆమె ఇంటి తాళం కూడా పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆమె ఇంట్లో 4 తులాల బంగారం పోయినట్లుగా తెలిపింది. దొంగలు గ్రామంలో రెక్కీ నిర్వహించి పక్కా ప్లానింగ్‌తో ఒక్క రాత్రిలోనే మూడు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు.